# 15,400 స్థాయి కీలకం




**సమీక్ష** : ఐరోపా మార్కెట్లలో రుణ సంక్షోభం భయాలు కొనసాగడం, దేశీయ మార్కెట్ నుంచి నిధులు వెనక్కు తీసుకోవడం, ఇతర ప్రధాన కరెన్సీలతో రూపాయి మారకపు విలువ క్షీణించడం తదితర కారణాలు దేశీయ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. దీంతో గత వారం కూడా నష్టాలతో ముగిసింది. అంచనాల కంటే తగ్గిన అమెరికా జీడీపీ, నిరుత్సాహపరించిన చైనా తయారీ రంగ గణాంకాలు అంతర్జాతీయంగా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీంతో గతవారం మార్కెట్ తొలి రోజు బలహీనంగా ప్రారంభమైంది. ఫ్యూచర్స్ కాంట్రాక్టుల గడువు ముగింపు రోజైన గురువారం ఒక దశలో రెండేళ్ల కనిష్ఠ స్థాయికి తాకినప్పటికీ.. షార్ట్ కవరింగ్‌ల కారణంగా తర్వాత కొద్దిగా కోలుకుంది. అదే రోజు ఆహార ద్రవ్యోల్బణం 9.01 శాతానికి తగ్గినట్లు ప్రభుత్వం వెల్లడించడం కూడా మార్కెట్ కోలుకోవడానికి దోహద పడింది. అయితే.. ఎఫ్ఐఐల అమ్మకాలు కొనసాగడంతో కోలుకున్న మార్కెట్ అదే స్థాయిలో కొనసాగలేదు. మల్టీ బ్రాండ్ రిటైల్ విభాగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించడం దిగువ స్థాయిల వద్ద మార్కెట్‌కు మద్దతు లభించే విధంగా చేసింది. మొత్తం మీద గత వారం సెన్సెక్స్ 676 పాయింట్లు క్షీణించి 15,695 పాయింట్ల వద్ద ముగిసింది.

**ఎఫ్ఐఐల పనితీరు** గత వారం విదేశీ సంస్థాగత మదుపుదారులు (ఎఫ్ఐఐ) నికరంగా రూ. 4,396 కోట్ల అమ్మకాలు జరిపారు. మరో వైపు దేశీయ మ్యూచువల్ ఫండ్‌లు తక్కువ ధరల వద్ద షేర్లను కొనుగోలు చేశాయి. మ్యూచువల్ ఫండ్‌లు నికరంగా రూ. 1,068 కోట్ల పెట్టుబడులు పెట్టాయి.

**రంగాల వారీగా** గిరాకీపై అంచనాలు ఆశావహంగా లేకపోవడంతో లోహ షేర్లు బాగా తగ్గాయి. భారీ అమ్మకాల ఒత్తిడితో దీర్ఘకాలం మన్నే వినియోగ వస్తువుల కంపెనీల షేర్ల ధరలు క్షీణించాయి. చమురు రంగం షేర్లలో నష్టాలు కొనసాగాయి. రక్షణాత్మక రంగంగా పరిగణిస్తున్న ఔషధ కంపెనీల షేర్లు లాభాలతో ముగిశాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించడంతో రిటైల్ కంపెనీల షేర్లకు మద్దతు లభించింది. దిగువ స్థాయి ధరల వద్ద యంత్ర పరికరాల తయారీ కంపెనీల షేర్లను మదుపర్లు కొనుగోలు చేశారు.

**శుక్రవారం నాటికి లాభపడిన, నష్టపోయిన షేర్లు 5:4 నిష్పత్తిలో ఉన్నాయి. దిగువ స్థాయిల్లో మదుపర్లు షేర్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారన్న విషయాన్ని ఇది సూచిస్తోంది.**

**భవిష్యత్ అంచనా** గతవారం సెన్సెక్స్ కీలకమైన మద్దతు స్థాయి 15,700-15,800ను ఛేదించి కిందకు వెళ్లింది. వచ్చే కొద్ది వారాలు/నెలల్లో 14,000-14,500 వరకు తగ్గే అంశాన్ని ఇది సూచిస్తోంది. వరుసగా గత నాలుగు వారాలుగా మార్కెట్ నష్టపోతోంది. కోలుకునే ప్రయత్నాలు జరిగితే.. 16,750 పాయింట్ల స్థాయిలో గట్టి నిరోధం ఎదురయ్యే వీలుంది.

**ప్రభావిత అంశాలు** ఈవారం వెంటనే మార్కెట్‌ను ప్రభావితం చేసి దిశను నిర్దేశించే అంశాల్లో ఐరోపా ప్రాంత పరిణామాలు, ఎఫ్ఐఐల నిధుల ప్రవాహం ఉన్నాయి. 30న రెండో త్రైమాసిక స్థూల దేశీయోత్పత్తి గణాంకాలను ప్రభుత్వం విడుదల చేయనుంది. అంచనాల కంటే జీడీపీ వృద్ధిరేటు తక్కువగా ఉంటే మార్కెట్ ప్రతికూలంగా స్పందించవచ్చు. రూపాయి మారకపు విలువ మరింత క్షీణిస్తే అమ్మకాల ఒత్తిడి పెరగొచ్చు. గత వారం ఆహార ద్రవ్యోల్బణం తగ్గింది. ఇదే ధోరణి కొనసాగితే వడ్డీరేట్లు కీలకమైన రంగాల షేర్లకు కొనుగోలు మద్దతు లభించొచ్చు. నెలవారీ వాహన, ఉక్కు, సిమెంట్, టెలికాం రంగాల అమ్మకాల గణాంకాలు ఆయా షేర్ల కదలికలపై ప్రభావితం చూపొచ్చు. ముడి చమురు ధరలు మరింత పెరిగితే మార్కెట్ మరింత క్షీణించే వీలుంది.

**తక్షణ నిరోధ స్థాయిలు:** 15,933, 16,165, 16,347; **తక్షణ మద్దతు స్థాయిలు:** 15,400, 15,275, 14,835

**15,400 పాయింట్ల స్థాయి కంటే దిగువకు సెన్సెక్స్ క్షీణిస్తే, స్వల్పకాలానికి మరింత పతనమయ్యే వీలు ఉంది.**

*– సతీశ్ కంతేటి, జెన్ మనీ*